ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

ప్రాంతీయ వార్తలు

తేది: 28.08.2026 సమయం. 13.10 గంటలు

ముఖ్యాంశాలు

1. తెలంగాణవ్యాప్తంగా రాఖీ పండుగ వేడుకలు మిన్నంటాయి. పండుగ సందర్భంగా రాష్ట్రంలోని అక్కచెల్లెళ్ళలకు గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా , ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి , మాజీ ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్ రావు శుభాకాంక్షలు తెలిపారు.
2. విశ్వనగరం పేరుతో గత బీఆర్ఎస్, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వాలు హైదరాబాద్‌ను విషాద నగరంగా మార్చేశాయని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు విమర్శించారు.
3. నేపాల్ ఆకస్మిక వరదల్లో చిక్కుకున్న తెలంగాణ పౌరుల భద్రతకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు.
4. హైదరాబాద్ - విజయవాడ - NH-65 రహదారిపై ప్రమాదాల నివారణకు 17 బ్లాక్ స్పాట్లలో చేపట్టిన ఫ్లైఓవర్ల పనులను వేగవంతం చేయాలని రోడ్లు , భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ఆదేశించారు.

---

**రాఖీ పౌర్ణమి**

తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా రాఖీ పౌర్ణమి వేడుకలు అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. తోడబుట్టిన సోదరులకు రాఖీలు కట్టి , తమ ఆత్మీయ అనుబంధాన్ని చాటుకునేందుకు సోదరీమణులు పెద్ద సంఖ్యలో పుట్టింటికి తరలివెళ్తున్నారు. హైదరాబాద్‌లో రాఖీ పండుగ సందర్భంగా ప్రధాన బస్టాండ్లు , రైల్వే స్టేషన్లలో రద్దీ నెలకొంది. సోదరులకు రాఖీ కట్టేందుకు మహిళలు సొంతూళ్లకు వెళుతున్నారు. దీంతో జేబీఎస్ , ఎంజీబీఎస్, ఉప్పల్, దిల్‌సుఖ్‌నగర్ బస్ స్టేషన్లతోపాటు సికింద్రాబాద్ , కాచిగూడ, నాంపల్లి రైల్వే స్టేషన్లు ప్రయాణికులతో కిటకిటలాడుతున్నాయి. తెలంగాణ సంస్కృతిలో రక్షాబంధన్‌ను అత్యంత కీలకమైన పండుగగా

భావిస్తారు. వరంగల్, కరీంనగర్, నిజామాబాద్, ఖమ్మం, మహబూబ్‌నగర్, నల్గొండ తదితర జిల్లాల్లో వేడుకలు ఘనంగా జరుపుకొంటున్నారు. ఈ సందర్భంగా జూబ్లీహిల్స్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి మంత్రులు సీతక్క , కొండా సురేఖ, మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ గద్వాల విజయలక్ష్మి , బ్రహ్మకుమారీలు, పలువురు నాయకులు , అంధుల పాఠశాల విద్యార్థినులు రాఖీలు కట్టారు. ఇక కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి రాఖి పండుగ ను ఘనంగా జరుపుకొన్నారు. హైదరాబాద్‌లో మంత్రి పొన్నం ప్రభాకర్‌కు ఆయన సోదరీమణులు రాణి , విమల రాఖీలు కట్టి స్వీట్లు తినిపించగా , మాజీ మంత్రి హరీశ్ రావు నివాసంలో మహిళా ప్రజాప్రతినిధులు, అభిమానులు ఆయనకు రాఖీలు కట్టి శుభాకాంక్షలు తెలిపారు. బీజేపీ నాయకులు ఎన్. రాంచందర్ రావుకు వారి సోదరి రాఖీ కట్టగా , వేములవాడ శాసనసభ్యులు, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ స్వగృహంలో ఆయన సోదరి రాఖీ కట్టి తమ ప్రేమానురాగాలను చాటుకున్నారు.

డెస్క్

**రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు**

రాఖీ పౌర్ణమి పండుగ సందర్భంగా గవర్నర్ శివ ప్రతాప్ శుక్ల , ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి , మాజీ ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్ రావు రాష్ట్రంలోని అక్కచెల్లెళ్ళలకు శుభాకాంక్షలు తెలిపారు. అన్నాచెల్లెళ్లు , అక్కాతమ్ముళ్ల అనుబంధానికి ప్రతీకైన ఈ పండుగను అందరూ ఆనందంగా జరుపుకోవాలని వారు ఆకాంక్షించారు. ప్రతి ఇంట్లో సుఖసంతోషాలు , ఆరోగ్యం వెల్లివిరియాలని అన్నారు. అక్కా తమ్ముళ్ళు , అన్నాచెల్లెళ్లు అనుబంధం అజరామరమని వెల్లడించారు.

డెస్క్

**రాఖీ వేడుకలు జిల్లాలు**

రాఖీ పౌర్ణమి పండగను పురస్కరించుకుని నిర్మల్ జిల్లాలో వేడుకలు ఘనంగా నిర్వహించుకున్నారు. సోదరీలు సోదరులకు రాఖీలు కట్టి తమ ఆత్మీయ అనుబంధాన్ని

చాటుకున్నారు. జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా జిల్లా ప్రజలకు రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు తెలిపారు.  మంచిర్యాల జిల్లా చెన్నూర్ ఆయుష్ యోగ కేంద్రంలో రక్షాబంధన్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. అన్న చెల్లి అనుబంధం   ,  పరస్పర రక్షణకు ప్రతీకగా నిలిచే రాఖీ పండుగ సందర్భంగా యోగ కేంద్రంలోని సభ్యులు ఒకరికొకరు రాఖీలు కట్టుకున్నారు. రాఖీ పండుగ ను పురస్కరించుకొని జిల్లా ప్రజలకు కలెక్టర్ కుమార్ దీపక్ శుభాకాంక్షలు తెలిపారు. రక్షాబంధన్ పురస్కరించుకొని హన్మకొండ జిల్లాలో వేడుకలు నిర్వహించారు. ఈ వేడుకలలో ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి పేరు పాల్గొన్నారు.  ఈ సందర్భంగా పలువురు మహిళలు సోదరీమణులు ఎమ్మెల్యేకు రాఖీలు కట్టి తమ అభిమానాన్ని చాటుకున్నారు. కాగా హనుమకొండ జిల్లా ప్రజలకు రాఖీ పౌర్ణమి సందర్భంగా శుభాకాంక్షలు తెలియజేశారు హన్మకొండ కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్.  మహిళల గౌరవం సమానత్వం స్వాభిమానాన్ని కాపాడటమే నిజమైన రక్షణ అని హనుమకొండ కలెక్టర్ పేర్కొన్నారు.          రాఖీ పౌర్ణమి సందర్భంగా  వైద్య    ,   ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ రాష్ట్ర ప్రజలకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. పరస్పర గౌరవం   ,  ఆప్యాయత,  రక్షణ,  అండగా నిలిచే స్ఫూర్తి, కుటుంబ జీవనం లో ప్రత్యేక సాంప్రదాయ , సంస్కృతిక వేడుక కు ఈ పండుగ ప్రతి రూపమని పేర్కొన్నారు.    రక్షాబంధన్ పర్వదినాన్ని పురస్కరించుకుని నల్గొండలోని క్యాంపు కార్యాలయంలో తెలంగాణ శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి కి బ్రహ్మకుమారీస్ ప్రతినిధులు  రాఖీ కట్టి , రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలిపారు... సమాజంలో సోదరభావం, ప్రేమ, శాంతి, పరస్పర గౌరవం మరింత పెంపొందాలని ఆకాంక్షించారు.

**పీటీసీలు – నిర్మల్, మంచిర్యాల, వరంగల్, సంగారెడ్డి, నల్గొండ**

**పొన్నం ప్రభాకర్**

రాఖీ పౌర్ణమి పండుగను పురస్కరించుకుని ప్రయాణికుల సౌకర్యార్థం టీజీఎస్ఆర్టీసీ ఆధ్వర్యంలో 5,000 ప్రత్యేక బస్సులను అందుబాటులోకి తెచ్చినట్లు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. అధికారులతో నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడుతూ     ,

ఆగస్టు 27 నుంచి 31 వరకు ఈ బస్సులు నడుస్తాయని , మహిళలకు మహాలక్ష్మి పథకం కింద ఉచిత ప్రయాణం యథావిధిగా కొనసాగుతుందని స్పష్టం చేశారు. తిరుగు ప్రయాణాల రద్దీకి అనుగుణంగా అదనపు బస్సులను సిద్ధంగా ఉంచాలని , బస్‌స్టేషన్లలో మౌలిక సదుపాయాలు కల్పిస్తూ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షించాలని ఆదేశించారు.

డెస్క్

**రాంచందర్ రావు**

విశ్వనగరం పేరుతో గత బీఆర్ఎస్ , ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వాలు హైదరాబాద్‌ను విషాద నగరంగా మార్చేశాయని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు విమర్శించారు. తార్నాక డివిజన్‌లో మాదాల రాధాకృష్ణ ఆధ్వర్యంలో పలువురు విద్యావంతులు పార్టీలో చేరిన సందర్భంగా ఈ వ్యాఖ్యలు చేశారు. కనీస మౌలిక వసతులు , డ్రైనేజీ వ్యవస్థల లేమితో నగరవాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. హైదరాబాద్ అభివృద్ధి కేవలం బీజేపీతోనే సాధ్యమని , రాబోయే మూడు మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీని గెలిపిస్తేనే ప్రధాని మోదీ ప్రవేశపెట్టిన కేంద్ర పథకాలు ప్రజలకు పారదర్శకంగా అందుతాయని రాంచందర్ రావు స్పష్టం చేశారు.

డెస్క్

**భట్టి విక్రమార్క**

తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఈరోజు కర్ణాటక రాష్ట్రం , రాయచూర్ జిల్లాలోని ‘హట్టి గోల్డ్ మైన్’ను సందర్శించారు. దేశంలోనే ఏకైక ప్రభుత్వ రంగానికి చెందిన ఈ బంగారం ఉత్పత్తి సంస్థలోని ప్రొడక్షన్ యూనిట్ , బంగారం శుద్ధి కేంద్రం , ఎలక్ట్రో విన్నింగ్ కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా మైన్స్ అధికారులు బంగారం తయారీ విధానాన్ని ఉప ముఖ్యమంత్రికి వివరంగా తెలియజేశారు. హట్టి గోల్డ్ మైన్స్ ప్రాజెక్ట్ ద్వారా ప్రతిరోజు సగటున 2 నుంచి 4 కిలోల బంగారం తయారవుతుందని అధికారులు వివరించారు. ఉప ముఖ్యమంత్రి వెంట సింగరేణి సిఎండి బుద్ధ ప్రకాష్ జ్యోతి, ప్లానింగ్ డైరెక్టర్ వెంకటేశ్వర్లు, జిఎమ్ పంకజ్ కులశ్రేష్టలతో పాటు ఇతర అధికారులు ఉన్నారు.

డెస్క్

**నేపాల్ వరదలు**

నేపాల్ ఆకస్మిక వరదల్లో చిక్కుకున్న తెలంగాణ పౌరుల భద్రతకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ఇప్పటివరకు గుర్తించిన 23 మంది వివరాలను కేంద్ర విదేశాంగ శాఖకు పంపించామని , కాఠ్మాండులోని భారత రాయబార కార్యాలయంతో నిరంతరం సమన్వయం చేస్తున్నట్లు వెల్లడించారు. న్యూఢిల్లీ తెలంగాణ భవన్ , సచివాలయంలో ప్రత్యేక హెల్ప్‌లైన్లు ఏర్పాటు చేశామని , బాధితుల కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని సూచించారు. సహాయం కోసం నిర్దేశిత హెల్ప్‌లైన్ నంబర్లలో సంప్రదించాలని కోరారు.

డెస్క్

**కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి**

హైదరాబాద్ - విజయవాడ - NH-65 రహదారిపై ప్రమాదాల నివారణకు 17 బ్లాక్ స్పాట్లలో చేపట్టిన ఫ్లైఓవర్ల పనులను వేగవంతం చేయాలని రోడ్లు , భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ఆదేశించారు. చిట్యాల ఫ్లైఓవర్‌ను దసరా నాటికి, మిగిలిన వాటిని డిసెంబర్ నాటికి పూర్తి చేసి సంక్రాంతికి వాహనాల రాకపోకలకు సిద్ధం చేయాలన్నారు. 6+2 రహదారి విస్తరణ , ఇతర ఎన్‌హెచ్‌ఏఐ ప్రాజెక్టుల వేగవంతం కోసం త్వరలోనే కేంద్రమంత్రి నితిన్ గడ్కరీని , అవసరమైతే ప్రధానిని కలుస్తామని రోడ్ సేఫ్టీ సమీక్షా సమావేశంలో వెల్లడించారు.

డెస్క్

**ఉత్తమ్ కుమార్ రెడ్డి**

తెలంగాణలో పెరుగుతున్న ధాన్యం ఉత్పత్తికి అనుగుణంగా 5 నుండి 10 లక్షల మెట్రిక్ టన్నుల శాస్త్రీయ నిల్వ సామర్థ్యంతో అత్యాధునిక ధాన్య సైలోల నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధం చేయాలని నీటిపారుదల , పౌర సరఫరాల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు. మహిళా స్వయం సహాయక సంఘాల ఆర్థిక సాధికారతకు ఈ సైలోల నిర్మాణం, నిర్వహణలో వారికి ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు తెలిపారు

డెస్క్

**వాకిటి శ్రీహరి**

కాంగ్రెస్ ప్రభుత్వ వెయ్యి రోజుల పాలనపై మాట్లాడే నైతిక హక్కు బీఆర్ఎస్‌కు లేదని మంత్రి వాకిటి శ్రీహరి విమర్శించారు. పదేళ్ల తమ పాలనలో ఉద్యోగాలు, రైతు రుణమాఫీ, ఇళ్ల నిర్మాణ హామీలను గాలికి వదిలేసిన ఆ పార్టీ నేతలు , ఇప్పుడు ప్రభుత్వంపై అసత్య ఆరోపణలు చేయడం హాస్యాస్పదమన్నారు.

డెస్క్

**కేటీఆర్**

కాంగ్రెస్ ప్రభుత్వ వెయ్యి రోజుల వైఫల్యాలు , నెరవేర్చని హామీలను ఎండగడుతూ సెప్టెంబర్ 2 నుంచి వారం రోజుల పాటు రాష్ట్రవ్యాప్త పోరుబాట చేపట్టాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారక రామారావు పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. టెలీకాన్ఫరెన్స్ ద్వారా దిశానిర్దేశం చేస్తూ , సెప్టెంబర్ 1న చార్జిషీట్ విడుదల చేసి, ఆపై ధర్నాలు, రైతు సదస్సులు, వంటావార్పు, విద్యార్థి ర్యాలీలు మరియు ఆటో ర్యాలీలతో నిరసనలు తెలుపనున్నట్లు చెప్పారు.

డెస్క్

**ప్రాణహిత నది**

ప్రాణహిత నదిపై తెలంగాణ ప్రభుత్వం తక్కువ విద్యుత్ వ్యయంతో త్వరగా నిర్మించ తలపెట్టిన తుమ్మిడిహట్టి బ్యారేజ్ నిర్మాణానికి సంబంధించి సెప్టెంబర్ 1న ఢిల్లీలోని సేవా భవన్‌లో కేంద్ర జల సంఘం చైర్మన్ అధ్యక్షతన తెలంగాణ , మహారాష్ట్ర జలవనరుల శాఖల ఉన్నతాధికారుల కీలక సమావేశం జరగనుంది. ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి మహారాష్ట్ర సీఎం , ప్రధాని, కేంద్ర జలశక్తి మంత్రికి లేఖలు రాస్తూ చేసిన నిరంతర ప్రయత్నాల ఫలితంగా ఈ భేటీ ఏర్పాటు అయినట్లు సీఎంఓ తెలిపింది.

డెస్క్